క్లుప్తంగా

సింగిల్ ఫేస్ జనరేటర్ చోరీ



సింగిల్ ఫేస్ జనరేటర్ చోరీకి గురైన స్థలం

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధి సోమవరప్పాడులో సింగిల్ ఫేస్ జనరేటర్ చోరీకి గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపురం గ్రామానికి వెళ్లే దారిలో నూతనంగా ఎమ్మెస్ వెంచర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్కడ ఉన్న ఇంట్లో సింగిల్ ఫేస్ జనరేటర్‌ను దొంగలు చోరీ చేశారని ఇంటి యజమాని మీరా మొహుద్దీన్ తెలిపారు.

చెత్తను సంపద తయారీ కేంద్రానికి పంపాలి



చెత్త తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పద్మ

ముండ్లమూరు (దర్శి): గ్రామ పంచాయతీల్లో తడి చెత్త పొడి చెత్త వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు పంపించాలని డీఎల్‌పీఓ పద్మ సూచించారు. మండలంలోని ఈదర, కెల్లంపల్లి, ఉల్లగల్లు, వేముల గ్రామ పంచాయతీల్లో ఐవీఆర్ఎస్ సర్వేల్లో భాగంగా డోర్ టూ డోర్ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో మాట్లాడి చెత్త నుంచి సంపద తయారీ గురించి వివరించారు. నివాసాల్లో ఇచ్చిన రెండు డబ్బాల్లో తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా నిల్వ చేయాలన్నారు. ఈ చెత్తను సంపద తయారీ కేంద్రానికి తీసుకెళ్లి ఎరువులుగా మార్చనున్నట్లు పేర్కొన్నారు. కార్యదర్శి రాజేశ్వరి, గురునాథం, జె. శ్రీనివాసులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర వస్తువులు సకాలంలో అందించాలి



తరగతి గదులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌలేశ్వర్

తాళ్లూరు: ప్రభుత్వం సరఫరా చేస్తున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర వస్తువులు ప్రతి ఒక్క విద్యార్థికి అందేలా చూడాలని డిప్యూటీ డీఈఓ చంద్రమౌలేశ్వర్ అన్నారు. స్థానిక వీకేజీహెచ్ ప్రభుత్వ పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందించనున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర వస్తువులకు స్టాక్ పాయింట్‌గా స్థానిక వీకేజీహెచ్ ప్రభుత్వ పాఠశాలను ఎంచుకున్నట్లు చెప్పారు. ఈ వస్తువులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. సీఎంఓ రూతు, ఎంఈఓ-1 సుబ్బయ్య, ఎంఈఓ-2 సుధాకర్ పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పుల్లలచెరువు: గ్రామాల్లో నాటుసారా తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాలపై మండలంలోని నరజాముల తండా పరిసర ప్రాంతాల్లో బుధవారం దాడులు నిర్వహించినట్లు చెప్పారు. దాడుల్లో బెల్లం ఊట 5.50 లీటర్లను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం చట్టరీత్యా నేరమని, గ్రామాల్లో ఎవరైనా తయారు చేస్తుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కలలో పట్టాభి రామస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన గ్రామోత్సవంలో గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కస్టమ్స్ హైరింగ్ కేంద్రాలకు మంగళం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 14 యూనిట్లు మంజూరు
- ప్రస్తుతం వాటి ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం

పెద్దారవీడు: రైతులకు అండగా ఉండి అదుకుంటామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాస్తవం రూపంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందించే కస్టమ్స్ హైరింగ్ సెంటర్లకు ఎలాంటి తోడ్పాటు అందించడం లేదు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో ఉన్న ఆయా కేంద్రాలకు కొత్త వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సైతం అందించని పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి భారం తగ్గించే విధంగా ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల సాయంతో వ్యవసాయం చేసుకునేలా యంత్ర పరికరాలను రాయితీపై అందించి రైతులకు ఎంతో మేలు చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ద్వారా గ్రామాల్లో రైతులను సభ్యులుగా చేర్చి సంఘాలుగా ఏర్పాటు చేసి వాటిని కస్టమ్ హైరింగ్ సెంటర్లుగా నెలకొల్పారు. ఈ కేంద్రాలకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో, 60 శాతం బ్యాంకు రుణం ఇప్పించారు. ఒక యూనిట్‌కు రూ.15 లక్షలకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు అందించారు. యంత్ర పరికరాల్లో భాగంగా ట్రాక్టర్లు, నూర్పు యంత్రాలు, రోటోవేటర్లు, దుక్కిసెట్లు, పవర్ టిల్లర్లు, రేపర్లు, పరదాలు వంటివి అందజేశారు. ఈ పరికరాలను సంఘం పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి, సంఘం సభ్యుల తీర్మానం మేరకు సంఘ సభ్యులతో పాటు చుట్టుపక్కల రైతులు వ్యవసాయానికి ఈ యంత్ర పరికరాలను తక్కువ ఖర్చుతో వినియోగించుకుని వ్యవసాయం చేసుకునే వారు. దీంతో రైతులకు కూలీల కొరత తీరడమే కాకుండా పెట్టుబడి ఖర్చు తగ్గేది. గత ప్రభుత్వంలో రైతు సేవా కేంద్రాలను యూనిట్‌గా తీసుకొని 14 కస్టమ్స్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 14 ట్రాక్టర్లతో పాటు మిగతా యంత్ర పరికరాలను అందించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు నిబంధనలతో వ్యవసాయ యంత్ర పరికరాలు మంజూరు చేసింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రైతులకు అందజేస్తున్న యంత్ర పరికరాలు (ఫైల్)

> **యంత్ర పరికరాలతో మేలు జరిగింది**
>
> 
>
> గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కస్టం హైరింగ్ సెంటర్ల ద్వారా ట్రాక్టర్‌తో పాటు వివిధ యంత్ర పరికరాలు అందించారు. ట్రాక్టరతో యంత్ర పరికరాలు వ్యవసాయం సాగు చేసేందుకు రైతులకు ఎంతో మేలు జరిగింది. వ్యవసాయానికి పెట్టుబడి పెరిగి పోతున్న రోజుల్లో యంత్ర పరికరాలతో వ్యవసాయం చేయడంతో ఖర్చు తగ్గుతుంది. తక్కువ ఖర్చుతో ఈ పరికరాలు వాడుకుంటున్నాం. దీంతో కొంత మేర పెట్టుబడి తగ్గుతుంది.
>
> వెన్నా శివకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు

> **నిబంధనల ప్రకారం యంత్ర పరికరాలు**
>
> పెద్దారవీడు మండలానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలకు రూ.9 లక్షలు మంజూరు చేసింది. రైతు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ఒక రైతు సేవా కేంద్రం పరిధిలో ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ ఉన్న రైతుకు 50 శాతం సబ్సిడీతో 16 రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు ఇస్తారు. ఎస్సీ, ఎస్టీలకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. రైతు పంట నమోదు 6 ఏళ్లలోపు ఒక్కసారి నమోదై ఉండాలి. రైతు పేరుపై 5 ఎకరాల లోపు పొలం ఉండాలి. అర్హులైన రైతులకు త్వరలో యంత్ర పరికరాలు అందించే అవకాశం ఉంది. గతంలో అందించిన ట్రాక్టర్లు ఆయా రైతుల వద్దే ఉన్నాయి. ప్రస్తుతం వాటిని వినియోగిస్తున్నారు.
>
> కె.బుజ్జిబాయి, ఏఓ, పెద్దారవీడు

నేడు విజయాంజనేయ స్వామి తిరునాళ్ల

దొనకొండ: స్థానిక అడ్డ రోడ్డులోని పాపులమ్మ బావి సమీపంలో వెలసిన శ్రీ విజయాంజనేయ స్వామి తిరునాళ్లను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 18వ వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా గణపతి పూజ, పంచామృత అభిషేకాలు, మండపారాదన, సహస్ర నామ అర్చన, పొంగళ్లు విజయాంజనేయ స్వామికి సమర్పిస్తామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బాలిరెడ్డి తెలిపారు.



అలంకరణలో విజయాంజనేయస్వామి

ఎమ్మెల్యే తాటిపర్తి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: అగ్ని ప్రమాదంలో గృహాన్ని కోల్పోయిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని అయ్యంబొట్లపల్లెలో పూజల సత్యనారాయణకు చెందిన పూరి గుడిసె మంగళవారం దగ్ధమైంది. ఆ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జిల్లా కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషు, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కె.సత్యనారాయణ చౌదరి, సర్పంచ్‌లు రాగాల వెంకటయ్య, ఫిలిప్, వెంకటరామయ్య, ఎ.సుబ్బయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓట్ల చేర్పుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఈఆర్ఓ జాన్సన్

దర్శి: బీఎల్ఓలు ఓట్ల మార్పులు, చేర్పుల్లో అప్రమత్తంగా ఉండాలని ఈఆర్ఓ ఎస్.జాన్సన్ సూచించారు. దర్శి నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల నాయకులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా బీఎల్ఓలు అవగాహన కల్పించాలన్నారు. తమ పరిధిలోని ఓట్లు మార్పులు చేర్పులు, ఆధార్ అనుసంధానం వంటి ప్రక్రియలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలు ఉంటే నిరభ్యంతరంగా చెప్పుకోవచ్చని చెప్పారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, డీటీ దేవప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



జాబ్ కార్డులు పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు అధికారి

పెద్దదోర్నాల: చెంచు గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకట శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతల గిరిజన గూడెంలో ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెంచు కుటుంబం ఉపాధి హామీ కార్డు కలిగి ఉండాలని కోరారు. ప్రజలందరూ 150 రోజుల పని దినాలు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్డులను ఐటీడీఏ నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 187 చెంచు గూడేల్లో దశల వారీగా పంపిణీ చేసి వారి జీవనోపాధులను, ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్డుల ద్వారా చెంచులకు వారి కుటుంబ సభ్యులు ఎన్ని పని దినాలు ఉపయోగించుకున్నారు? వారి బ్యాంకు ఖాతా నంబర్‌కు ఎంత డబ్బు పొందారన్న విషయాలను సులభంగా తెలుసుకోవచ్చని చెప్పారు. జాబ్ కార్డు పుస్తకంలో జన్మన్ నరేగా యాప్‌ను మొబైల్లో డౌన్‌లోడ్ చేసుకుని వారి వివరాలు తెలుసుకునే విధానాన్ని వివరించినట్లు జిల్లా ఏపీఓ మధుసూదనరావు వివరించారు. పీఎంయూ సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ కిరణ్‌కుమార్, ఏఆర్‌హెచ్ సంస్థ డైరెక్టర్ రామకృష్ణ, కో ఆర్డినేటర్ కరుణాకర్, పల్నాడు పీఎంయూ, ఏపీఓ కమృద్దీన్, నంద్యాల ఏపీఓ, మహబూబ్‌బాషా, టీఏ లాలా అహ్మద్ పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు

దర్శి: మండలంలోని చందలూరు పీహెచ్‌సీలో గర్భిణులకు బుధవారం రక్త పరీక్షలు చేశారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా 28 మంది గర్భిణులకు మెడికల్ అధికారి డాక్టర్ బ్లెస్సీ 15 రకాల రక్త పరీక్షలు చేశారు. షుగర్, బరువు, ఎత్తు, హీమోగ్లోబిన్, పరీక్షలు, బ్లడ్ గ్రూపింగ్ పరీక్ష, యూరిన్ పరీక్ష, ఎల్ఎఫ్‌టీ పరీక్ష, ఆర్ఈఎఫ్ పరీక్షలు నిర్వహించారు. బ్లెస్సీ మాట్లాడుతూ రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్, సూక్రోజ్ ఇంజెక్షన్ చేశారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రిలలోనే ప్రసవం చేసుకోవాలని సూచించారు. సీహెచ్ఓ దయామణి, ల్యాబ్‌టెక్నీషియన్ వసంతకుమార్, సుభాషిణి, శ్యామల, రత్తమ్మ, పిచ్చమ్మ పాల్గొన్నారు.



గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ బ్లెస్సీ

చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

యర్రగొండపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటూ ఐదేళ్లు నిండిన పిల్లలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్ కోరారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలతో పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులతో మంచి సంబంధాలు ఉంటాయని, చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వారిని ప్రభుత్వ బడుల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 31 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయని, ఐదేళ్లు నిండిన చిన్నారుల జాబితా ఈ నెల 10వ తేదీలోపు తమకు అందజేయాలన్నారు. హెచ్ఎంలు చెన్నకేశవస్వామి, తిరుపతినాయక్, శ్రీకాంత్, సీఆర్ఎంటీలు కోటేశ్వరరావు, జీవీఎల్ఎస్ మూర్తి, యల్లయ్య, హనుమానాయక్, అంగన్‌వాడీ కార్యకర్త రామకుమారి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ చిన్నారులతో ఎంఈవోలు

భక్తులకు భద్రత కల్పించాలి



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

- దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

తాళ్లూరు: మండలంలోని గుంటి గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 14న వచ్చే భక్తులకు భద్రత కల్పించాలని దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆదేశించారు. గుంటి గంగ భవానీ అమ్మవారి వార్షిక తిరునాళ్ల సందర్భంగా దేవస్థాన పరిసర ప్రాంతాలను ఆయన బుధవారం పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐ మల్లికార్జునరావు, ఏఎస్ఐ మోహన్‌రావు, ఆలయ ఈఓ గుంటపల్లి వాసు, చైర్మన్ గురుబ్రహ్మం, ప్రసాదరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు

దొనకొండ: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి తెలిపారు. బుధవారం అరబస్తాన్, శివాజీ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలు, బేతేలుపురం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం లీలాబాయి గర్భిణులకు రక్త హీనత గురించి వివరించి పరీక్షలు చేశారు. అనంతరం చిన్న పిల్లల్లో బరువు తక్కువగా ఉండటానికి సంబంధించి పిల్లల బరువు, ఎత్తు పరీక్షించి తల్లులకు అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చిన్నారులకు సరైన ఆహార అలవాట్లు నేర్పించాలని సూచించారు. స్థానిక బేతేలుపురం, శివాజీనగర్, అరబస్తాన్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు జయమణి, నిర్మల, ఝాన్సీ, ఆయాలు పద్మాబాయి, మేరి, నాగేంద్రం పాల్గొన్నారు.

కురిచేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక నుసుం బజారు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త షేక్ ఫాతిమా మాట్లాడుతూ గర్భస్థ దశ నుంచి పిల్లలకు 24 నెలల వయసు వచ్చే వరకు తీసుకోవాల్సిన సంరక్షణ గురించి వివరించారు. పోషణ లోపం ఉన్న పిల్లలను ఏ విధంగా గుర్తించాలో ఆమె వివరించారు. పౌష్టికాహార లోపాలను ఏ విధంగా అధిగమించాలనే విషయాలను, పిల్లల్లో ఊబకాయం తగ్గించడానికి ఆరోగ్యకర జీవనశైలి గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.ప్రభావతి, ఏఎన్ఎం మేరి చార్లెస్, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కురిచేడు: పోషకాహారం గురించి వివరిస్తున్న ఫాతిమా

క్షుద్రపూజల కలకలం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో రెండు రోజులుగా క్షుద్రపూజల పేరుతో జరుగుతున్న తతంగం మండల వాసులను కలవరానికి గురి చేస్తోంది. ఆకాశం మీదకు రాకెట్లను పంపుతున్న నేటి రోజుల్లో మూఢ నమ్మకాలు జడలు విప్పుతున్నాయి. చేతబడి, క్షుద్రపూజల పేరుతో కొందరు జనాలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ పక్కనే ఓ ప్రాంతంలో ముగ్గులు వేసి పసుపు, కుంకుమతో అలంకరించారు. ఓ గిన్నెలో తాయత్తును పోలిన ఓ రాగి వస్తువు ఉంచటంతో పాటు అందులో కోడి ఈకలను పెట్టడం స్థానికులను కలవరానికి గురి చేస్తోంది. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి డబ్బులు సంపాదించేందుకు కొందరు చేసే జిమ్మిక్కులని న్యూడెమక్రసీ నాయకుడు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి పేర్కొంటున్నారు.